క్లుప్తంగా

అలరించిన స్వరరాగ సుధా



నగరంపాలెం: స్థానిక నల్లచెరువు ఏరియాలోని కోదండరామాలయం సాయినాథుని సన్నిధిలో శనివారం స్వరరాగ సుధా నిర్వహించారు. కె.వి.సాయిబాబా శర్మ ఆధ్వర్యంలో జరగ్గా, భక్తి సంకీర్తనలను అలపించారు. భక్తులను అలరించగా, కీబోర్డుపై రామకృష్ణ శర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు పుల్లారావు పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

జేఈఈ మెయిన్స్‌లో మాట్రిక్స్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మాట్రిక్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు సంస్థ డైరెక్టర్లు బి.రామిరెడ్డి, పి.ఏడుకొండలు తెలిపారు. విద్యానగర్ ఒకటో లైనులోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వివిధ కేటగిరీల్లో ఎం.వైష్ణవి 566, డి.శివతేజ 2,519, డి.పరిమళ 5,472, కె. చరణ్‌తేజ 5,620, డి.నారాయణ రెడ్డి 6,587, జె.హర్ష నారాయణ 11,464 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

24 నుంచి వేసవి శిక్షణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ ఉన్నత పాఠశాలలో ఈనెల 24 నుంచి మే 15 వరకు ''బియాండ్ బుక్స్ సమ్మర్ ఆఫ్ స్కిల్స్ అండ్ స్మైల్స్'' పేరుతో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శనివారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం బ్రోచర్ ఆవిష్కరించారు. వివరాలకు 91263 33555, 97353 33555 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు , అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సమన్వయకర్తలు దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీరామాయణ రహస్యములనే ప్రవచన కార్యక్రమాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో శనివారం శ్రీరామాయణ రహస్యములనే ప్రవచన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా ఉపనిషన్మందిరానికి చెందిన నిష్ఠల నరసింహమూర్తి మాట్లాడుతూ మన అందరితో రామ, కృష్ణ అనిపించిన వాల్మీకి మహర్షి, వ్యాస మహర్షిలకు మనం ఎంతో రుణపడి ఉన్నామని అన్నారు. రామాయణం అనగా రాముని ప్రయాణమని పేర్కొన్నారు. దేవుడు జీవుడి వైపు చేసే ప్రయాణం అవతారమని, జీవుడు దేవుడి వైపు చేసే ప్రయాణం ఉత్థానమని అన్నారు. మానవుడు కాముని వైపుగాకుండా దేవుడు వైపు అనగా రాముని వైపు ప్రయాణం చేయాలని ఆయన తెలిపారు.

అలరించిన జానపద పాటలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఏపీ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతి సమితి, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీటీ.వీ., కళాంజలి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు శనివారం ముగిశాయి. ఆలయ పాలకమండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, సినీ నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. రంగం రాజేష్ బృందం(విజయవాడ) ఆంధ్ర రాష్ట్ర ప్రగతి జానపద, ఆట పాట నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం, కళారత్న డాక్టర్ ఓవీ రమణ, ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణ పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు యువకుల అరెస్ట్
- పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు వెల్లడి



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలని ముగ్గురు యువకులు కలిసి గంజాయి కొనుగోలు చేసి గుంటూరులో విక్రయిస్తున్న వారిని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు శనివారం అదుపులో తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు.. కోబాల్ట్‌పేట 5వ లైన్‌కు చెందిన షేక్ సమీర్ అమరావతి రోడ్డులో మెకానిక్‌గా పని చేస్తుంటాడు. ఏటీ అగ్రహారానికి చెందిన నాగిపోగు బాలాజీ, కృష్ణబాబు కాలనీకి చెందిన నాగిపోగు శివతో కలిసి నేతాజీ నగర్‌లో రెండు బ్యాగ్‌లతో ఉన్నారు. పోలీసులును చూసి పారి పోతుండగా ముగ్గురిని పట్టుకుని వారి వద్ద ఉన్న బ్యాగ్‌లు తనిఖీ చేసినట్లు చెప్పారు. బ్యాగ్‌లో గంజాయి ప్యాకేట్స్ ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ముగ్గురు యువకులను పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా కోబాల్ట్‌పేటకు చెందిన షేక్ సమీర్ అమరావతి రోడ్డులో బైక్ మెకానిక్ షాపు ఉందని, అక్కడకు నిత్యం నాగిపోగు బాలాజీ, నాగిపోగు శివలు వస్తుండేవారని, అలా పరిచయం అయిన ముగ్గురు గంజాయి తాగడం ప్రారంభించారు. దీంతో డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో నర్సీపట్నం వెళ్లి గంజాయి కొని తెచ్చుకుని దానిని అధిక ధరకు గుంటూరు నగరంలోని విక్రయించడం ప్రారంభించారు. ఈ విక్రయించేందుకు తెచ్చిన గంజాయిని నేతాజీ నగర్ చెరువు దగ్గరకు వచ్చి ముగ్గురు గంజాయిని పంచుకుంటున్న నేపథ్యంలో 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారిని రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

రాహుల్‌గాంధీ, సోనియా ఫ్లెక్సీల దహనం



ఫ్లెక్సీ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: స్వాతంత్ర సమరయోధులకు చెందిన భూములు తక్కువ ధరకే తీసుకొని కాంగ్రెస్‌పార్టీ అధికారం అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడిందని బీజేపీ గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆరోపించారు. బీజేపీ యువజన విభాగం గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో శనివారం లాడ్జి సెంటర్‌లో నేషనల్ హెరాల్డ్ స్కామ్‌కి సంబంధించి కాంగ్రెస్ పార్టీ పూర్వ అధ్యక్షులు సోనియాగాంధీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన కుంభకోణానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్, యువమోర్చ నాయకులు తానుచింతల అనిల్, ఉపాధ్యక్షుడు రామిశెట్టి గోపి, బాల కోటయ్య, రామాచార్యులు రాజా, యువమోర్చా కార్యవర్గ సభ్యులు పాలెం రాజశేఖర్, తోకల హరి, వెంకట్, సాయినాథ్ రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ప్రవీణ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు సాయి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులతో పాటు బెటర్‌మెంట్ రాయనున్న విద్యార్థులకు పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఇంటర్మీడియట్ క్యాంపస్ ఇన్‌చార్జి జి.సురేష్ కుమార్‌ను 99122 03420 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం



దీపక్‌కుమార్

లక్ష్మీపురం: మానసిక స్థితి సరిగా లేక చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు ఈనెల 11వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో శనివారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 3వ లైన్‌కు చెందిన శిఖరం దీపక్‌కుమార్(53) చిన్నతనంలోనే ప్రమాదంలో తలకి తీవ్రమైన గాయం అయింది. దీంతో మానసిక స్థితి సరిగా ఉండక పోవడంతో చికిత్స పొందుతున్నాడు. ఈనెల 11న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టు పక్కల ప్రాంతాలలో వెతికిన ఎంతకు ఆచూకి తెలియలేదు. ఆయన సోదరుడు శిఖరం ఎస్ఎస్ ప్రసాద్ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోద చేశారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ నంబర్ 0863-2231955కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

లక్ష్మీపురం: అఖిలభారత యువజన సమాఖ్య జాతీయ మహాసభలో తిరుపతి నగరంలో మే 15వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జాతీయ మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ మహాసభలకు దేశ నలుమూలల నుంచి ఏఐవైఎఫ్ ప్రతినిధులతో పాటు జాతీయ నాయకత్వం పాల్గొంటుందన్నారు. యువతను చైతన్యపరచడం, యువతలో సామాజిక స్పృహను పెంపొందించడమే ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ తన మాటల గారడితో యువకులను, నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి యస్వంత్, నగర కార్యదర్శి బన్నీ, నాయకులు అరుణ్, ఖాసిం వలి, రెహ్మాన్, సుభాని, సద్దాం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన జేకేసీ కళాశాల విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రాయపాటి శ్రీనివాస్, మురళీమోహన్, గోపీచంద్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ తెలిపారు. శనివారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో 2024-25 విద్యాసంవత్సరం పొడవునా వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, హెటీరో ల్యాబ్స్, టీసీఎస్, బీపీఎస్, ఐఎల్ఎం, సూతర్‌లాండ్ గ్లోబల్, ఫస్ట్ సోర్స్, ఐటీసీ వంటి బహుళజాతి సంస్థల్లో 297 మంది విద్యార్థులు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించారని వివరించారు. అగ్రశ్రేణి సాంకేతిక సమాచార, అనేక రంగాల కంపెనీల్లో ఎంపికైన పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రాంతీయ సంస్థలైన శ్రీ చైతన్య, భాష్యం, స్పీకింగ్ ట్రీ వంటి ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల పాలకమండలి అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు విద్యార్థులతో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అధికారి డాక్టర్ యలవర్తి సురేష్‌బాబును అభినందించారు.

ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్, జీజీహెచ్ సిబ్బంది కలిసి శనివారం నిర్వహించారు. ఈనెల థీమ్ ఈ-వేస్ట్ మేనేజ్మెంట్, ఎలక్ట్రానిక్ వేస్ట్ అంటే ఏమిటి వాటిని, ఎలా డిస్పోస్ చేయాలి, వంటి విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఈ - వేస్ట్ మేనేజ్మెంట్ వ్యర్థాల్ని సరైన విధంగా డిస్పోస్ చేయకపోవడం వలన కలుగు నష్టాలు వాటి వలన వస్తున్న ఆరోగ్యపరమైన సమస్యలు, వీటి నుంచి ప్రజలు ఎలా విముక్తి పొందాలి వంటి విషయాలపైన ప్రజలు, విద్యార్థులకు, సిబ్బందికి, అవగాహన కల్పించారు. ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు నాటికలు, ఫ్లాష్ మాబ్ వంటి నృత్య ప్రదర్శనలు, ర్యాలీల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్, గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటిండెంట్లు గంగ, కిరణ్మయి పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భారతి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



ర్యాలీని నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ప్రత్తిపాడు: సమతుల ఆహారంతో ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని తిమ్మాపురం, రావిపాటివారిపాలెం గ్రామాలలో గర్భవతులు, మహిళలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎస్. భారతి, పి.మాధవిలు మహిళలకు సమతుల ఆహారం, చిరుధాన్యాలు, తక్కువ ఖర్చులో ఎక్కువ పోషక విలువలున్న ఆహారాన్ని తయారు చేసుకోవడం ఎలా.. వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ మంచి సమతుల ఆహారంతో పాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సమతుల ఆహారంలో చిరుధాన్యాలు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జంక్ ఫుడ్స్ ఎలాంటి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దని వివరించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.హేమలత, పి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొమ్మూరు(కాకుమాను): గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత దేవి అన్నారు. మండలంలోని కొమ్మూరు ఎస్సీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుజాత దేవి మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే తల్లీ శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ పి.వెంకాయమ్మ పాల్గొన్నారు.

గోర్లవారిపాలెంలో..

గుంటూరు రూరల్: మండలంలోని గోర్లవారిపాలెంలో పోషణ్ పక్వాడ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. వారోత్సవాలను గ్రామ సర్పంచి నల్లమేకల అప్పమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎంపీ రత్నం మాట్లాడుతూ 1000 రోజుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా స్త్రీలు గర్భం దాల్చిన రోజు నుంచి పుట్టిన బిడ్డకు 2 సంవత్సరాలు వచ్చే వరకూ అందించే పౌష్టికాహారం, రక్షణ కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీదేవి, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఏఎన్ఎం నర్మద, అంగన్‌వాడీ టీచర్లు అనంతలక్ష్మి, పీ సుజాత, వి.అంజలి పాల్గొన్నారు.

టైరు పగిలి హైవేపై ఆటో బోల్తా

ప్రత్తిపాడు: చేపల లోడుతో వెళ్తున్న ఆటో టైరు పగిలి హైవేపై బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరు నుంచి శనివారం చిలకలూరిపేట పేట వైపు చేపల లోడుతో వెళ్తున్న ఆటో టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో వాహనం 16వ నంబరు జాతీయ రహదారిపై అదుపుతప్పి, ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం వద్ద ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలోని పెద్ద వాటర్ ట్యాంక్‌లో ఉన్న చేపలు చెల్లాచెదురుగా కింద పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా బోల్తా పడిన ఆటోను స్థానికులు పొక్లెయిన్ సాయంతో బయటకు లాగారు. ప్రమాదంపై ఎలాంటి పిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

గోరంట్లలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం(పెద్దగుడి)లో శనివారం శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని గోరంట్ల గ్రామంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో 120 పడకలతో ఆస్పత్రి ఏర్పాటు చేయటం జరిగిందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చన్నారు. వైద్య శిబిరంలో 300 మందికి పైగా పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అందజనేయులు, వేణుగోపాల్, గజవల్లి శివన్నారాయణ, సతీష్, ఎండీ ఆము, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ మౌనిక, డాక్టర్ రాహుల్‌చంద్ర, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న పాస్టర్ సతీష్‌బాబు

నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతి కొరకు, దేశ సమైక్యత కొరకు శనివారం గుంటూరు నగరంలోని వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ నిర్వహించడం శుభపరిణామని రన్ ఫర జీసస్ కో ఆర్డినేటర్ పాస్టర్ రెవరెండ్ గనుపల్లి సతీష్‌బాబు పేర్కొన్నారు. వెస్ట్ ప్యారిస్ చర్చి నుంచి ప్రారంభమై కంకరగుంట ఫ్లై ఓవర్, లక్ష్మీపురం, లాడ్జిసెంటర్, శంకర్ విలాస్ మీదుగా ఏసీ కాలేజీ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు పునరుత్థానాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా శాంతి సమానత్వంతో ఎదుటివారిని ప్రేమించాలన్నారు. క్రీస్తు ప్రేమను క్రియల్లో చూపించే విధంగా క్రైస్తవులు శాంతి సమాధానానికి చిహ్నమని క్రైస్తవులంతా ఐక్యతతో ఉన్నామని చెప్పడానికి ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ మల్లెల రాజు, పాస్టర్ పాల్ మనోహర్, బాబు ఆశీర్వాదం, రత్నప్రసాద్, ఆనంద్‌పాల్, విల్సన్, పరిశుద్ధరావు, డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, మద్దు ప్రేమజ్యోతిబాబు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

సుమేధ హైస్కూల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం



గ్రీన్ కలర్ డే యాక్టివిటీని నిర్వహిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ప్రతి నెలా మూడో శనివారం వ్యర్థాల సేకరణ, పరిసరాల పరిశుభ్రత, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన జీవన స్థితిగతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. చెత్త నుంచి వ్యర్థాల సేకరణ, సురక్షితంగా రీ-సైకిల్ చేయడమే లక్ష్యమని, చెత్త నుంచి సంపద సృష్టితో సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రీన్ కలర్ డే యాక్టివిటీని నిర్వహించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదరించాలి



విరాళాన్ని అందజేస్తున్న విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన పిల్లలను సాధారణ పిల్లలతో సమానంగా చూడాలని విశ్రాంత డెప్యూటీ కలెక్టర్, సమగ్రశిక్ష పూర్వ ఏపీసీ జి.విజయలక్ష్మి పేర్కొన్నా రు. బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న సమగ్ర శిక్ష జిల్లా వనరుల కేంద్రంలో ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు విద్యా ఉపకరణాలు, బోధన సదుపాయాల నిమిత్తం ఆమె రూ.20 వేలు విరాళాన్ని అందజేశారు.

ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు భగవంతుని ప్రతిరూపాలని, వారిని సమాజంలోని అందరితో సమానంగా ఆదరించాలని అన్నారు. సాధారణ పిల్లలతో సమానంగా ఎదిగేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని సూచించారు. భవిత కేంద్రంలో సేవలు అందిస్తున్న రీసోర్స్ పర్సన్లను అభినందించారు.

ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

గుంటూరు రూరల్: మండలంలోని అడవితక్కెళ్లపాడు గ్రామం పుచ్చలపల్లి సుదరయ్య కాలనీలోని ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ 9వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్కూల్‌లోని కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీని స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్రారంభించారు. ఈసందర్భంగా మలినేని గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు లైబ్రరీని ప్రారంభించి మాట్లాడుతూ దాతల సహకారంతో నడుస్తున్న ఈ స్కూలు ఎంతో ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్‌లో ఈ స్కూలు అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, శేషగిరిరావు, పెద్దబ్బాయి, సుభాషిణి, కొమ్మాలపాటి శ్రీధర్, పెద్ది సాంబశివరావు, గాంధీ, స్కూల్ ప్రిన్సిపాల్ తాండవ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.దివ్య, శ్రీపతిరావు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



పెదకాకాని సెంటర్‌లో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదకాకాని: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది వాకా రాంగోపాల్‌గౌడ్ అన్నారు. పెదకాకానిలో సెంటర్‌లో శనివారం స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతిని పురస్కరించుకుని పెదకాకాని సెంటర్‌లో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కారంకి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాకా రాంగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలో సర్దార్ గౌతులచ్చన్న ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మనదేశంలో సర్దార్ వల్లబాయి పటేల్ తరువాత సర్దార్‌గా పిలువ బడే వ్యక్తి గౌతులచ్చన్న అన్నారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా పని చేశారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, స్వాతంత్ర్య సమరంలో లక్షల మందిని సర్దార్ గౌతు లచ్చన్న నడిపించిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు లింగంగుంట సాల్మన్‌రాజు, గోళ్ళ శ్యాంముఖర్జీబాబు, ఆత్మకూరి వెంకటేశ్వర్లు, క్రోసూరి పూర్ణచంద్రరావు, వుప్పాల శివాజీ, కుక్కల నాగమల్లేశ్వరరావు, పాగోలు రాము, కారంకి వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, మేడా శివకృష్ణ, కొమ్మూరి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ నల్లమడ వాగు ముంపు వలన ఏటా వేల ఎకరాలు ముంపు బారిన పడి పంట దెబ్బతింటుందని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు, గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు డి.రమేష్‌బాబు, కె.వెంకటశివరావు, పి.సుధీర్ పాల్గొన్నారు.